# టెక్నాలజీపైనే దేశం మనుగడ

## • మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్వీఎస్ రెడ్డి

హైదరాబాద్ సిటీ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): దేశం మనుగడ టెక్నాలజీపైనే ఆధారపడి ఉందని హైదరాబాద్ మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి అన్నారు. తార్నాకలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ)లో గురువారం సైన్స్ అండ్ కల్చరల్ ఫెస్టివల్ సంయుక్త-2024 జరిగింది. కార్యక్రమానికి మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యువ పరిశోధకులు ప్రతి విషయాన్ని ఆలోచించి నేర్చుకోవాలన్నారు. లక్ష్యాలను చేరుకునే సమయంలో వైఫల్యాలు ఎదురైనప్పటికీ ప్రయత్నాలను వదులుకోవద్దన్నారు. హైదరాబాద్‌లో పబ్లిక్, ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) మోడల్‌లో మెట్రో నిర్మాణం చేస్తున్నప్పుడు తాము ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నామని, సున్నితమైన అంశాలపై జాగ్రత్తగా వ్యవహరించామని వివరించారు. పీపీపీ పద్ధతిలో ప్రాజెక్టు చేపడుతున్నప్పుడు చాలామంది నిపుణులు ఇది మూర్ఖపు ఆలోచన అని, జింక్‌డ్ ప్రాజెక్టుగా చెప్పారని, అయితే దీని విజయగాథను ఇటీవల ప్రపంచ ప్రఖ్యాత స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం మేనేజ్‌మెంట్ ప్రాక్టీషనర్ల ప్రయోజనం కోసం ఇటీవల కేస్‌స్టడీగా తన జర్నల్‌లో ప్రచురించిందని గుర్తుచేశారు. యువశాస్త్రవేత్తలు వినూత్నంగా ఆలోచించాలని, ఆత్మ విశ్వాసంతో ఉండాలని, దేశ పురోగతికి దోహదపడాలని సూచించారు. కార్యక్రమంలో ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి, అసోసియేట్ డైరెక్టర్, ప్రొఫెసర్ అజయ్‌ధర్, మంజునాథ్, తదితరులు పాల్గొన్నారు.